**జరిగిన కథ :** పుత్రకుడు అనే వాణ్ని తండ్రి మోసగించాడు. దేవతకు బలివ్వబోతుంటే తప్పించుకుని పారిపోయాడు. ఒకచోట పుత్రకునికి ఇద్దరు అన్నదమ్ములు కనిపించారు. వాళ్లు తమ తండ్రినుంచి సంక్రమించిన పాదుకలు, దండం, బొంతసంచీలను పంచుకోవడంలో తగాదా పడుతున్నారు. వారి మధ్య తీర్పుకోసం వెళ్లిన పుత్రకుడు.. మహిమాన్వితమైన ఆ వస్తువులను చేజిక్కించుకుని నిర్జనారణ్యంలోకి వెళ్లాడు.




అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**

# మర్రిచెట్టు మీద బొంతసంచి

పుత్రకుడు ఆ వస్తువులన్నీ గట్టుమీద పెట్టి చెరువులోకి దిగిన కొద్దిసేపటికే అక్కడికి ఓ కోతుల గుంపు వచ్చిపడింది. వాటిని చూస్తూనే భయపడిన పుత్రకుడు మరికొంచెం లోతుకు వెళ్లాడు. అవి గట్టుమీద స్వేచ్ఛగా తిరుగుతూ పుత్రకుడు తెచ్చిన మూడు వస్తువులతో ఆటలాడటం మొదలుపెట్టాయి. పుత్రకుడు కంగారుపడి చెరువులోనే ఉండి తామరపూలతో కోతులను అదిలించాలని ప్రయత్నించాడు. అవి పుత్రకుడి వంక చూసి గుర్రుమన్నాయి. అతను జడుసుకున్నాడు.

ఇంతలో పాదుకలను రెండు కోతులు చెరోటి నెత్తిపై పెట్టుకుని సమీపంలోని తలో చెట్టెక్కాయి. మరో కోతి సంచి మూతికున్న దారపు కొనలాగి మెడకు చుట్టుకుని ఎగిరింది. దండాన్ని మరోకోతి దక్కించుకుంది.

ఇంకా భయపడుతూ కూర్చుంటే లాభం లేదని పుత్రకుడు చెరువునుంచి బయటికొచ్చి వాటివెంట పడ్డాడు. చెట్టెక్కి పట్టుకోవాలని చూశాడు కానీ లాభం లేకపోయింది. అవి కొండలు కోనలు ఎక్కిదిగిపోతూ అతణ్ని చాలాదూరం పరిగెత్తించాయి. చివరికి కనిపించకుండా పోయాయి.

'ఆహా! ధనాశతో ఆ అమాయకుల పిత్రార్జితాన్ని దొంగిలించాను. ఆ దోషం నన్ను వెంటనే కొట్టింది. ఇలా కోతుల రూపంలో దైవం నన్ను శిక్షించాడు. అయినా ఎన్నో దేశాలుండగా.. నేనీ నిర్జనారణ్యానికి రావడం ఎందుకు? ఇక్కణ్నుంచి బయటికెలా పోవాలో కూడా తెలియడం లేదు. సరే.. ఇప్పుడు చేయగలిగింది కూడా ఏమీ లేదు. తపస్సు వల్ల అన్ని పాపాలూ దగ్ధమవుతాయని చెబుతారు కదా! ఈ అడవిలో చేతనైనంత తపస్సు చేసుకుంటాను' అనుకున్నాడు.

ఆనాటినుంచి తటాకాల్లో నీళ్లు తాగుతూ, చెట్ల పళ్లు – దుంపలు తింటూ ఏకాగ్రతతో గాయత్రీజపం చేయసాగాడు. అలా ఎంతకాలం గడిచిందో తెలియదు.

అతను తపస్సు చేస్తున్న ప్రాంతానికి.. ఒకనాడు ఉన్నట్లుండి కొందరు స్త్రీలు నీటికోసం కడవలెత్తుకు రావడం గమనించాడు.

'అరె! ఇక్కడో పల్లె ఉందా? నేనిన్నాళ్లూ గమనించనే లేదే..' అనుకుంటూ వాళ్లను సమీపించి పలకరించాడు. కానీ, వాళ్లభాష అతనికి అర్థం కాలేదు. వాళ్ల సైగల వల్ల పల్లె అక్కడికి సమీపంలోనే ఉందని మాత్రం అర్థమైంది.

ఆనాటినుంచి ప్రతిరోజూ పల్లెవాళ్లు తరచుగా ఆ చెరువుకు రావడం గమనిస్తూ ఉన్నాడు. జన సంపర్కంతో తపస్సు పలచబడింది. కోతులు తన దగ్గర్నుంచి ఎత్తుకుపోయిన దండం రెండోకొన నేలకు పడుతూనే.. అక్కడో పల్లె పుట్టుకొచ్చిందని క్రమంగా అర్థం చేసుకున్నాడు.

అలాగైతే కాస్త కష్టపడితే తాను పోగొట్టుకున్న వస్తువులు దొరకవచ్చు అనిపించింది. తానుండే తావును విడిచిపెట్టి పల్లెకు పోయాడు. ఆ ప్రాంతంలో అదొక్కటే కాదు.. చాలా పల్లెలు ఉన్నాయి. అక్కడి ప్రజలలో ఒకడిగా కలిసిపోయాడు. వారి భాష తెలుసుకున్నాడు. వారితో సంభాషించి.. తన వస్తువుల జాడ పసిగట్టే ప్రయత్నం చేశాడు. కానీ లాభం లేకపోయింది.

'అనవసరంగా మళ్లీ ఆశలో చిక్కుకుని పండులాంటి తపస్సు పాడు చేసుకున్నాను. దొరకని వాటికోసం వెతికి కాలాన్ని వృథా చేసుకోవడం కంటే.. ఏదో ఒకరకంగా కాశీకి పోతే ముక్తి అయినా సంపాదించుకోవచ్చు' అనుకున్నాడు. అతనో పల్లెలో బాటవెంట నడుస్తుంటే ఒక చోట ఉపాధ్యాయుడు పిల్లలకు చెబుతున్న పద్యం ఒకటి వినిపించింది.

'దేవతలు, రాక్షసులు క్షీరసాగర మథనానికి పూనుకున్నారు. హాలాహలం వచ్చిపడ్డా.. ఎంతోకాలం పట్టినా కూడా అమృతం పొందేవరకు విరక్తి చెందలేదు. తలపెట్టిన కార్యాన్ని విసుగుతో ఎప్పుడూ విడిచిపెట్టేయకూడదు. ప్రయత్నం మానేయకూడదు. పట్టుదల ఉంటే ఎప్పటికైనా అనుకున్నది సాధించవచ్చు' అని తెలిపే నీతి పద్యమిది.

పుత్రకుడు ఆ పద్యభావాన్ని మననం చేసుకున్నాడు. 'ఈ పద్యం ఇప్పుడెందుకు వినిపించింది? ఈ శకునం ఏమిటో పరీక్షచేసి చూద్దాం!' అనుకున్నాడు. వెనక్కి తిరిగి మళ్లీ పల్లెల్లో వెతకజొచ్చాడు.

ఎవరి ఇంటిలో అయినా ప్రసవం అయితే బాలెంత రాలు ఉండే గదికి బయట చెప్పు కట్టడం పాతరోజుల్లో ఆచారం. అలా ఒక ఇంటిబయట తన పాదుక ఒకటి పుత్రకునికి కనిపించింది. వేగంగా వెళ్లి దాన్ని తీసుకోబోయాడు. ఆ ఇంటిలోనుంచి ఒక ముసలామె వచ్చి..

''ఇది బాలెంతరాలి గది. ఇక్కడికి ఎవరూ రాకూడదు. పోపో!'' అని అదిలించింది.